సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 28 । డిసెంబర్ । 2022



కార్పొరేట్ స్థాయిలో విద్యారంగం అభివృద్ధి 8లో



గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం 8లో

నేటి నుంచి గిరి విజ్ఞాన సంబరాలు 8లో



న్యూస్‌రీల్

భూ రీసర్వే వేగవంతం

పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్

అరకులోయ రూరల్: భూ రీసర్వే వేగవంతంగా పూర్తి చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు, వీఆర్వోలు, భూసర్వే బృందంతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు భూరీ సర్వే పనులను ఆరు నెలల్లో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. పనులు పూర్తిచేసేవరకు సంబంధిత ఉద్యోగులకు సెలవులు ఉండవన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో అరకు ఎమ్మెల్యే భేటీ



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: నియోజకవర్గంలో అభివృద్ధి పనుల విషయమై కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మంగళవారం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ భేటీ అయ్యారు. కలెక్టరేట్‌లో కలిసిన ఆయన అరకులోయ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు.రాష్ట్ర ప్రభుత్వం అరకు నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించిన సీఎం డీపీ నిధులను త్వరితగతిన ఆయా అభివృద్ధి పనులకు మంజూరు చేయాలని కోరారు. అరకులోయలో అదనపు కేంద్ర ఇంటిలిజెన్స్ విభాగం, ఇన్‌స్పెక్షన్ విభాగ కార్యాలయం నిర్మాణాలకు స్థల పరిశీలన పూర్తిచేయాలని కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్‌ను పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపినట్టు ఎమ్మెల్యే చెప్పారు.

డెమో క్లాసులకు హాజరుకండి

మారేడుమిల్లి: జిల్లాలోని గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న పీటీజీ, జెల్ పోస్టులకు ఆవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డెమో క్లాస్‌కు హాజరుకావాలని గురుకుల పాఠశాల కన్వీనర్ ఎస్‌కే అహ్మద్ అలీషా తెలిపారు. 2022–2023 సంవత్సరానికి పనిచేసేందుకు ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించినట్టు ఆయన పేర్కొన్నారు. వీరంతా ఈ నెల 29వ తేదీన తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో రంపచోడవరం గురుకుల పాఠశాలలో జరిగే డెమో క్లాసు, ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. స్థానిక ఐటీడీఏ ఆవరణలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు మంగళారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులతో పాటు, ఇతరులు కూడా ఆధార్ కేంద్రంలో తమ కార్డును అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఐదు మొబైల్ ఆధార్ కేంద్రాలు బ్లూత్రీ ఐటీ ద్వారా ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.ఐటీడీఏలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ వారం రోజులు పాటు ఉంటుందని తెలిపారు.

ఉధృతంగా చలిగాలులు

- పెరిగిన ఉష్ణోగ్రతలు
- చింతపల్లిలో 11.5
- మినుములూరులో 12
- అరకులోయలో 15.2 నమోదు



అరకులోయలో కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: జిల్లాలో ఉష్ణోగ్రతలు కాస్త పెరిగినప్పటికీ చలిగాలులు మాత్రం ఉధృతంగానే ఉన్నాయి. గత నాలుగు రోజుల నుంచి పొగమంచు కురవకపోయినా మన్యంలో పది డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అయితే సోమవారం అర్ధరాత్రి నుంచి నుంచి పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు నెలకొనడంతో పర్యాటకులు ప్రకృతి అందాలను వీక్షించారు. మంగళవారం చింతపల్లిలో 11.5 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 11.5 డిగ్రీలు, అరకులోయలో 15.2 డిగ్రీలు నమోదయ్యాయి.

అభినవ ద్రోణాచార్య



ఇండియా క్రికెట్ జట్టుకు ఎంపికైన గొంగడి త్రిషతో కోచ్ సుబ్బు

- క్రికెట్‌పై మక్కువ ఉన్నా అడ్డొచ్చిన పేదరికం
- కుంగిపోకుండా అకాడమి ఏర్పాటు
- తర్ఫీదునిస్తూ ఉన్నత స్థాయికి..
- అంతర్జాతీయ క్రీడాకారిణి గొంగడి త్రిష శిక్షణ పొందింది ఇక్కడే
- కలలను సాకారం చేసుకుంటున్న క్రికెట్ కోచ్ సుబ్బు

ఎంతో ఇష్టమైన క్రికెట్‌లో రాణించాలని కలలు కన్నాడు. మైదానంలో ఫోర్లు, సిక్సర్లతో మోత మోగించాలని, దేశానికి పేరు తేవాలని పదేపదే పరితపించాడు. అయితే టాలెంట్ ఉన్నా పేదరికం అడ్డొచ్చింది. ఆటపై ఉన్న మక్కువ పేదరికాన్ని జయించేలా చేసింది. తాను ఆడలేని క్రికెట్‌ను పదిమందితో ఆడించాలని భావించాడు. అభినవ ద్రోణాచార్యలా మారాడు. ఎందరికో అంతర్జాతీయస్థాయిలో తర్ఫీదునిస్తూ తన కలలను సాకారం చేసుకుంటున్నాడు చింతూరుకు చెందిన పొసర్లపూడి సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు.

చింతూరు: క్రికెట్‌లో ఎంతోమందికి తర్ఫీదునిస్తూ వారి ఉన్నతికి బాటలు వేస్తున్నాడు చింతూరుకు చెందిన పొసర్లపూడి సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు. పేదరికం కారణంగా మధ్యలోనే ఆటకు స్వస్తి పలికిన సుబ్బు తన కలల సాకారానికి అడ్డొచ్చిన పేదరికాన్ని అసహ్యించుకోలేదు. తాను సాధించలేనిది తన శిక్షణతో పలువురిని ఆటలో తీర్చిదిద్దేందుకు నడుం బిగించాడు. ఖర్చుతో కూడుకున్నదైనా క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేసి పలువురు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాడు. వారు మెరుగైన అవకాశాలు అందిపుచ్చుకునేలా చేస్తున్నాడు.

స్థానికంగానే చదువు..

సుబ్బు తండ్రి సత్యనారాయణ వడ్రంగి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుండగా సుబ్బు చింతూరులో ఇంటర్ వరకు చదివాడు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై మక్కువ పెంచుకున్న అతను స్థానికంగా జరిగే టోర్నమెంట్లలో ఆడుతూ మంచి నైపుణ్యం సాధించాడు. అదే సమయంలో అకాడమీలో చేరి క్రికెట్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆశించాడు. అతనికి పేదరికం అడ్డురావడంతో ఆశయానికి బ్రేక్‌పడింది. అనంతరం భద్రాచలంలో డిగ్రీలో చేరిన సుబ్బు 2010 నుంచి 2014 వరకు ఐదేళ్లపాటు చిన్నారులకు క్రికెట్‌లో కోచింగ్ ఇచ్చాడు. 2015 నుంచి 2016 వరకు హైదరాబాద్‌లోని సెయింట్‌జోన్స్ క్రికెట్ అకాడమీలో కోచ్‌గా పనిచేశాడు. 2016లో హైదరాబాద్‌లో ఎరీనా ఎలైట్ కోచింగ్ సెంటర్ ప్రారంభించి 2020 వరకు ఎందరో చిన్నారులకు క్రికెట్ ఓనమాలు నేర్పాడు. అనంతరం 2020లో తిరిగివచ్చిన ఆయన శ్రీ భద్రాద్రి క్రికెట్ అకాడమి పేరుతో సంస్థను నెలకొల్పాడు. ప్రస్తుతం అదే పేరుతో 30 మంది చిన్నారులకు కోచింగ్ ఇస్తున్నాడు.

రాణించిన త్రిష

భద్రాచలంకు చెందిన గొంగడి త్రిష 2010 నుంచి 2014 వరకు భద్రాచలంలో సుబ్బు కోచింగ్‌లో క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకుంది. దీంతో త్రిష హైదరాబాద్ జట్టుతో పాటు ఇండియా అండర్–16, అండర్–19 జట్లకు ఎంపికైంది. అనంతరం నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)కు ఎంపికై మరిన్ని మెళకువలు నేర్చుకుంది. ఇటీవల అండర్–19 మహిళా జట్టు తరఫున శ్రీలంక, వెస్టిండీస్, న్యూజిలాండ్ సిరీస్‌లో రాణించడం ద్వారా అండర్–19 వరల్డ్‌కప్‌లో పాల్గొనే భారత్ మహిళా జట్టుకు ఎంపికైంది. ఇదే బాటలో మరెందరో చిన్నారులు సుబ్బు కోచింగ్‌లో రాటుదేలుతున్నారు. ఉన్నత అవకాశాల కోసం వారంతా ఎదురు చూస్తున్నారు.



చిన్నారులకు బ్యాటింగ్ మెళకువలు నేర్పుతున్న కోచ్ సుబ్బు

భారత్ జట్టులో ఆడాలనుకున్నా

చిన్నతనం నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. ఎప్పటికైనా ఇండియా జట్టు తరఫున ఆడాలనుకున్నా. అనివార్య కారణాలతో ఆటను మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. ఎంతో ఇష్టమైన ఆటను వదల్లేక కోచ్‌గా బాధ్యతలు చేపట్టి చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాను. నా కోచింగ్‌లో రాటుదేలిన త్రిష ఇండియా జట్టుకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది. నా కళ ఇలా సాకారం చేసుకుంటున్నా.

–పొసర్లపూడి సుబ్రహ్మణ్యం, క్రికెట్ కోచ్, చింతూరు

అర్హులందరికీ నవరత్నాలు



లబ్ధిదారులకు నవరత్నాల పథకాల చెక్కును అందజేస్తున్న కలెక్టర సుమిత్‌కుమార్

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 3419 మందికి రూ.5.29 కోట్ల మేర ద్వైవార్షిక నగదు పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలో అర్హులైన లబ్ధిదారులందరికీ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాలను అమలుచేస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి నవరత్నాలు–ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో ఆయన ప్రసంగాన్ని అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం జిల్లాలోని 3419 మంది లబ్ధిదారులకు నవరత్నాలు–ద్వైవార్షిక నగదు రూ.5 కోట్ల 29 లక్షల విలువైన చెక్కును కలెక్టర్ సుమిత్‌కుమార్ పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు సాంకేతిక కారణాలతో నవరత్నాల పథకాలకు దూరమైన అర్హులందరికీ ప్రస్తుత ద్వైవార్షిక నగదు పంపిణీతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారన్నారు. జగనన్న అమ్మఒడి 981 మందికి, వైఎస్సార్ కాపునేస్తం 146 మందికి, వాహనమిత్ర 80 మందికి, చేయూత 628 మందికి, ఈబీసీ నేస్తం నలుగురికి, జగనన్న చేదోడు ఇద్దరికి, వసతి దీవెన 1304 మందికి వారి ఖాతాల్లో నగదు జమచేసినట్టు చెప్పారు. అంతేకాకుండా జిల్లాలో 5398 మందికి కొత్తగా సామాజిక పింఛన్లను మంజూరు చేశామన్నారు. వీరిలో డప్పు కళాకారులు ఇద్దరు, దివ్యాంగులు 461, వృద్ధాప్య పింఛన్లు 3709, ఒంటరి మహిళలు ఐదు, చెప్పులు కుట్టేవారు ఒకరు, నేత కార్మికులు ఇద్దరు, వితంతువులు 1219 మంది ఉన్నారన్నారు. అర్హత ఉన్న అందరికీ సామాజిక పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి నందు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఆర్టీసీ డీఎం ఆర్.సీతారాంనాయుడు పాల్గొన్నారు.

ఆడాకుల వీఆర్పీపై చర్యలకు కలెక్టర్‌కు నివేదిక

కొయ్యూరు: ఉపాధి హామీలో అవినీతికి పాల్పడిన ఆడాకుల వీఆర్పీ లక్ష్మిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ రమేష్ రామన్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదించామని చెప్పారు.ఇప్పటికే ఆమెకు మెమో ఇచ్చామని, అయితే దీనిపై ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదని ఆయన వివరించారు. ఆమె కొందరు అనర్హుల పేర్లను జాబ్‌కార్డుల్లో చేర్చారన్నారు. ఎవరు తప్పు చేసినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వచ్చే నెల నాలుగో తేదీ నుంచి కొయ్యూరులో ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు ప్రారంభిస్తారని పీడీ తెలిపారు.

పౌరసేవలకు పరివాహన్ వెబ్‌సైట్

జిల్లా రవాణా శాఖాధికారి లీలాప్రసాద్

సాక్షి,పాడేరు: రవాణా శాఖలో అందిస్తున్న పౌరసేవలు పొందేందుకు పరివాహన్ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని ఆశాఖ జిల్లా అధికారి ఎస్.లీలాప్రసాద్ మంగళవారం తెలిపారు. గతంలో ఈప్రగతి వెబ్‌సైట్ ఉండేదని, దాని స్థానంలో పరివాహన్ వెబ్‌సైట్‌ను రవాణాశాఖ తీసుకువచ్చిందన్నారు.రవాణాశాఖ పరిధిలోని వినియోగదారులంతా అన్ని పౌరసేవలు, రుసుము చెల్లింపులు, ఇతర లావాదేవీలనీ పరివాహన్ వెబ్‌సైట్ ద్వారా పొందాలని ఆయన కోరారు.

ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజుకు 18 వరకు గడువు

సాక్షి, పాడేరు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలకు సంబంధించి పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్యాయన కేంద్రం ద్వారా ఆడ్మిషన్లు పొందిన అభ్యర్థులు పరీక్ష ఫీజులు చెల్లించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టాబ్బాయి తెలిపారు. బీఏ, బీకాం, బీస్సీ విద్యార్థులు 1,2,3,4 సెమిస్టర్లకు సంబంధించి పరీక్ష ఫీజులు చెల్లించేందుకు నోటిఫికేషన్ విడుదలైందని పేర్కొన్నారు. 2017 నుంచి 2022 వరకు ఆడ్మిషన్లు పొందిన అభ్యర్థులు పరీక్ష ఫీజులు చెల్లించేందుకు అర్హులని తెలిపారు. ప్రతి పేపర్‌కు రూ. 150 చొప్పున బీఏ, బీకాం అభ్యర్థులు రూ.1050, బీఎస్సీకి రూ.1500 చెల్లించాల్సి ఉంటుందని సూచించారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి వైబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, ఏపీ ఆన్‌లైన్‌లో లేక డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా వచ్చే నెల 18వతేదీ లోగా పరీక్ష ఫీజులు చెల్లించాలని తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజులు ఈనెల 30వతేదీ వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు స్టడీ సెంటర్‌తో పాటు 9490458695, 7382929728, 9494372020 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

రాష్ట్రపతి పర్యటనతో సరిహద్దుల్లో అలెర్ట్



ఎటపాక వద్ద రాష్ట్ర సరిహద్దుల్లో మోహరించిన పోలీసు బలగాలు

ఎటపాక: భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్ము బుధవారం భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి దర్శనానికి రానుండటంతో రాష్ట్ర సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాష్ట్ర సరిహద్దులను మూసివేశారు. భద్రాచలం పట్టణంలోకి వాహనాల రాకను నిలిపివేశారు. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు ప్రాంతం ఎటపాక వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి సీఆర్పీఎఫ్ బలగాలతో పోలీసులు మోహరించారు. పట్టణంలోకి ప్రవేశించే వ్యక్తుల వివరాలను క్షణంగా పరిశీలిస్తున్నారు.దీంతో ఆంధ్రా, చత్తీస్‌గడ్, ఒడిశా రాష్టాల నుంచి తెలంగాణలోకి వెళ్లే వాహనాలన్నీ రాష్ట్ర సరిహద్దుల్లో భారీగా నిలిచిపోయాయి.రాష్ట్రపతి బుధవారం ఉదయం 10.15 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు భద్రాచలంలోనే ఉండటంతో అప్పటి వరకు ఆంక్షలు కొనసాగనున్నాయి.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

చింతూరు: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం భద్రాచలంలో పర్యటించనున్న నేపథ్యంలో ఎటపాక, చింతూరు మండలాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. ఎటపాక మండలంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నెల్లిపాక జంక్షన్, బొజ్జిగుప్ప, ఎటపాక పోలీసు స్టేషన్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు ఎటపాక సీఐ గజేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. అలాగే చింతూరు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భద్రాచలం వైపు వెళ్లే వాహనాలను చింతూరు మండలం చట్టి వద్ద నిలిపి వేయనున్నట్లు చింతూరు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.


సమరయోధుల స్ఫూర్తితో పోరాటం

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు

అరకులోయ రూరల్: హక్కుల సాధనకు బ్రిటిష్ పాలకులపై పోరాడిన గిరిజన పోరాట సమరయోధుల స్ఫూర్తితో పనిచేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు అన్నారు. మండలంలో పద్మాపురం పంచాయతీలో ఓ ప్రైవేట్ రిసార్ట్స్ ఆవరణలో దండకారణ్య విమోచన సమితి వ్యవస్థాపకుడు చెండా ఏలియా ఆధ్వర్యంలో మంగళవారం డీఎల్‌వో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రవిబాబు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనే ప్రధాన లక్ష్యంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ పాలకులో పోరాడిన సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వారి పోరాట ఫలితంగానే ఎన్నో హక్కులు, చట్టాలు సాధించుకోగలిగామని తెలిపారు. దండకారణ్య విమోచన సమితి వ్యవస్థాపకుడు చెండా ఏలియా మాట్లాడుతూ ఆదివాసీ ప్రజల హక్కులు, చట్టాల పరిరక్షణకు దండకారణ్య విమోచన సమితి ఏర్పడిందన్నారు. గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేసే విశ్వవిద్యాలయాలకు గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల పేరు పెట్టాలన్నారు. ఒడిశా మాజీ ఎంపీ జైరాంపాంగి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు, దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాణిక్యం, ప్రధాన కార్యదర్శి ఎల్‌టీ కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి గంగధరస్వామి, ఎస్టీ కమిషన్ సభ్యులు విశ్వేశ్వరరాజు, లిల్లీ,రామలక్ష్మి, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ జర్ర అప్పారావు, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ పోల్లవరపు అప్పారావు పాల్గొన్నారు.



ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన డుడుమ జలపాతం సమీప కొండలపై మంగళవారం సాయంత్రం సప్తవర్ణాల్లో మబ్బులు కనువిందు చేశాయి. ఈ సుందర దృశ్యాలను ప్రకృతి ప్రేమికులు మొబైళ్లతో ఫొటోలు తీసుకుని పదిలపరచుకున్నారు.

– ముంచంగిపుట్టు

క్రీడలతో పోటీతత్వం

అరకు ఎంపీ గొడ్డేటి మాధవి



పరిచయం చేసుకుంటున్న ఎంపీ మాధవి



వాలీబాల్ సర్వీసు చేస్తున్న ఎంపీ మాధవి

కొయ్యూరు: క్రీడలు పోటీతత్వాన్ని పెంపొదిస్తాయని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. శరభన్నపాలెంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ రెండో రోజు పోటీలను ప్రారంభించారు. గతంలో పీఈటీగా పనిచేసిన అనుభవం ఉన్న ఆమె వాలీబాల్ సర్వీసు చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.అంతకు ముందు క్రీడాకారులనుంచి వందనం స్వీకరించారు. అనంతరం పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభక్కరూ ఆటల ద్వారా దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గెలుపు సాధించాలంటే దానికి అవసరమైన సాధన చేయాలని సూచించారు. విశాఖపట్నం–గుంటూరు జట్ల మధ్య మ్యాచ్‌ను తిలకించారు. నేనుసైతం చారిటబుల్‌సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్, సర్పంచ్ కె. సత్యనారాయణ,చారిటబుల్ సంస్థ ఫౌండేషన్ డైరెక్టర్లు దాడి శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఉమమాహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాంబాబు, సహాయ కోఆర్డినేటర్లు సుధాకర్,రమణ,కోశాధికారి పుష్పలత, పీఈటీలు పాల్గొన్నారు.

టీడీఎస్ రికవరీ బాధ్యత డీడీవోలదే

- సక్రమంగా లేకుంటే శాఖాపరమైన చర్యలు
- ఆదాయపన్నుశాఖ అధికారి రేణుకాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదాయపన్నుశాఖ అధికారి రేణుకాదేవి

సాక్షి,పాడేరు: అన్ని ప్రభుత్వశాఖల్లోని డీడీవోలంతా తమ సిబ్బంది టీడీఎస్ రికవరీని బాధ్యతగా తీసుకోవాలని విశాఖ ఆదాయ పన్నుశాఖ అధికారి ఎన్. రేణుకాదేవి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాలోని వారితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పలు సూచనలు చేశారు. ప్రతి మూడు నెలలకు ఓ సారి సరిచూసుకుని ఆదాయ పన్నుశాఖకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తమ పరిధిలోని సిబ్బందికి గత ఏడాది ఆదాయపు పన్నును పరిగణనలోకి తీసుకుని, దాని ప్రకారం ప్రతి నెల రికవరీ చేయాలని సూచించారు. ప్రతి నెలా టీడీఎస్ రికవరీ ద్వారా ఏడాది చివరిలో ఉద్యోగులపై భారం పడదని, వసూలు చేసిన టీడీఎస్‌ను సకాలంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి మాట్లాడుతూ డీడీవోలంతా ఆదాయపు పన్నుపై అవగాహన పొందాలన్నారు. ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా ప్రతి నెలా టీడీఎస్ రికవరీ చేయాలని, ఉద్యోగులు కూడా చివరి నిమిషంలో హడావుడి పడకుండా సకాలంలో వ్యక్తిగత రిటర్న్ ఫైల్ చేసేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. జిల్లా ఖజానాధికారి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ప్రతిశాఖ ట్యాన్ నంబర్ పొందాలని, ఆ నంబర్ ద్వారానే ఉద్యోగుల టీడీఎస్ రికవరీ నగదును జమచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పన్ను ఇన్‌స్పెక్టర్లు కుమార్, ఉమామహేశ్వరరావు, రమేష్, బాబ్జి,శ్రీధర్ తదితరులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆదాయపు పన్ను మదింపుపై అవగాహన కల్పించారు.

1.5 కోట్ల పనిదినాల లక్ష్యం

- రూ.400 కోట్ల అంచనాతో పనుల ప్రతిపాదన
- మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ.275 కోట్ల కేటాయింపు
- ఉపాధి బకాయిలు రూ.60 కోట్లు చెల్లింపు
- డ్వామా పీడీ రమేష్ రామన్



మాట్లాడుతున్న పీడీ రమేష్‌రామన్

కొయ్యూరు: జిల్లాలో 2023–24కు సంబంధించి 1.5 కోట్ల మేర లక్షల పనిదినాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నామని డ్వామా పీడీ ఎస్.రమేష్ రామన్ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో వీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.400 కోట్లతో పనులు చేపడతామన్నారు. దీనిలో రూ.275 కోట్లు మెటీరియల్‌కు కేటాయిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో 2.18లక్షల జాబ్‌కార్డుదారులు ఉన్నారని, 2022–23లో ఇప్పటివరకు 93 లక్షల పనిదినాలు పూర్తిచేసినట్టు చెప్పారు. రానున్న మార్చి నాటికి మిగిలిన వాటిని పూర్తి చేస్తామని తెలిపారు. ఈఏడాది డిసెంబర్ 11 వరకు జిల్లాలో బకాయి ఉన్న రూ.60 కోట్లను చెల్లించినట్టు చెప్పారు. నచ్చినచోట నుంచి రైతులు మొక్కలు తెచ్చుకుని నాటుకుంటే వాటికి చెల్లింపులు చేస్తామని చెప్పారు. గొయ్యిలకు కూడా డబ్బులు చెల్లిస్తామని వివరించారు. ఇందుకు పంచాయతీ రాజ్ కమిషనర్ ఆమోదించినట్టు ఆయన తెలిపారు. మునగ, జామ, కమలా, డ్రాగన్‌ఫ్రూట్ వంటి ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలన్న ఆలోచన ఉందన్నారు. ఎన్ఎంఎంఎస్ నుంచి తప్పించాలని ఇక్కడ పరిస్థితిని వివరిస్తూ కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి లేఖ రాశామన్నారు.2021 మే 21న కేంద్రం జాతీయ మొబైల్ పర్యవేక్షణ సాఫ్ట్‌వేర్(ఎన్ఎంఎంఎస్)ను ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా ఉపాధి పనులు చేస్తున్న కూలీలను జియో ట్యాగింగ్ చేస్తారన్నారు.అయితే అల్లూరి జిల్లాలో సెల్ కవరేజ్ కలిగిన గ్రామాలు 30 శాతానికి మించి లేకపోవడంతో జియో ట్యాగింగ్ చేయడం సాధ్యం కావడం లేదన్నారు.దీనిని చేయకుండా పనులు చేసినా అవి నమోదు కావడం లేదని చెప్పారు. దీంతో కష్టించి పనులు చేసిన కూలీలకు డబ్బులు రాని పరిస్థితి నెలకొందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని గ్రామాలకు సెల్ సేవలు అందేంత వరకు సడలింపు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఉపాధి కూలీలు సగటున రూ.230 సంపాదిస్తున్నారని,దీనిని రూ.257కు పెంచేందుకు చూస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీవో మేరీరోజ్, చింతపల్లి క్లస్టర్ ఏపీడీ రామారావు, ఏపీవో రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

చింతపల్లిరూరల్: గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బాలాజీపేటలో మంగళవారం గిరిజనులకు పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు చేపడుతోందని, గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. విద్యాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెడుతుంటే ప్రతి పక్షాలు దిగజారుడు రాజకీయాలు చేయడం దారుణమన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు తగిన గుణపాఠం తప్పదన్నారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీపీ అనూషా, జెడ్పీటీసీ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యం: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సీకరి పంచాయతీ కేంద్రం నుంచి లక్ష్మీపేట పంచాయతీ కుడాసింగి వరకు రూ.2.50కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే పాల్గుణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణంతో లక్ష్మీపేట, గోమంగి, కిముడుపల్లి , లబ్బిరి, అలమగుండాలు



సీకరిలో రైతులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

కుడాసింగి తదితర గ్రామస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దశలవారీగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజినీర్లను కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. సీకరి పంచాయతీలో 85 మంది రైతులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను ఎమ్మెల్యే పాల్గుణ అందజేశారు. ప్రభుత్వం లబ్ధిదారులకు హక్కు పట్టాలతో పాటు రైతు భరోసా అందిస్తోందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జె. సూర్యనారాయణ, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ సన్యాసి, ఎంపీడీవో విగ్గిన్స్, వైస్ ఎంపీపీ రాజుబాబు, సర్పంచ్ కృష్ణారావు, ఎంపీటీసీ ఆనందరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్, సర్పంచ్‌లు, నాయకులు సూర్యనారాయణ, గంగాభవానీ, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో విద్యారంగం అభివృద్ధి



జీకే వీధిలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



పెదబయలులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



చింతూరులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ట్యాబ్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి

గూడెంకొత్తవీధి: కార్పొరేట్ స్థాయిలో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు.

నాడు–నేడుతో పాఠశాలల అభివృద్ధి: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కనీసం బడులకు మరమ్మతులు కూడా చేయలేని దుస్థితిలో విద్యార్థులు చదువుకునే దయనీయ పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. నాడు-నేడు ద్వారా కోట్లాది రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. విద్యార్థులకు సాంకేతికను అందిపుచ్చుకోవడానికి ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఈఓ చంద్రశేఖర్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంపీపీ బోయినకుమారి, జెడ్పీటీసీ శివరత్నం పాల్గొన్నారు.

ఉత్తమ విద్య అందించడమే సీఎం ధ్యేయం: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా ఉత్తమ విద్య అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని పెదబయలు గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల-1లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం నాడు–నేడు ద్వారా కోట్లాది రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు. మండలంలో రూ.1.30కోట్లతో 731 మంది విద్యార్థులకు తొలి విడతలో ట్యాబ్‌లు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ విద్యార్థులు ప్లకార్డులతో స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ బొంజుబాబు, రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ సన్యాసి, ఎంపీడీవో విగ్గిన్స్, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, ఎంఈవో సింహాచలం, హెచ్ఎంలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యకు పెద్దపీట: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

చింతూరు: విద్యార్థులకు పాఠశాల స్థాయి పునాది వంటిదని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును సుగమం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలసి ఆమె విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. విద్యార్థుల కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నారన్నారు. నాడు-నేడుతో కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. మండల పరిధిలో తొలి విడతలో 749 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు మంజూరైనట్టు తెలిపారు. అనంతరం ఆమె మండలంలోని కల్లేరు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించనున్న ధాన్యం నిలువ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, ఎంఈవో లక్ష్మీనారాయణ, ప్రజాప్రతినిధులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్భయంగా అభ్యంతరాలు తెలియజేయండి

ఎస్‌డీసీ సుబ్బారావు

కూనవరం: రైతులు తమ భూములకు సంబంధించి అభ్యంతరాలను గ్రామసభలో నిర్భయంగా తెలియజేసుకోవచ్చుని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోలవరం (భూసేకరణ) కూనవరం యూనిట్ అధికారి సుబ్బారావు తెలిపారు. చినార్కూరు పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం, చినార్కూరు జెడ్ భూములకు సంబంధించిన అభ్యంతరాలపై మంగళవారం చినార్కూరులో పంచాయతీలో సర్పంచ్ సున్నం అభిరామ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ పట్టాదారు మరణించి ఉంటే అతని కుటుంబ సభ్యులు వారసత్వ, మరణ ధ్రువీకరణ పత్రాలను తప్పులు లేకుండా పొందుపరిస్తే



గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్‌డీసీ సుబ్బారావు

ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఖాతాల్లోని నగదు జమ అవుతుందన్నారు. ఎంపీపీ పాయం రంగమ్మ మాట్లాడుతూ రైతులు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండ్రాజుపేట సర్పంచ్ కట్టం లక్ష్మి, వీఆర్వో ధర్మరాజు,డీటీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి శివ మణికంఠ, జాహ్నవీ, తులసి, సర్వేయర్ శివ పాల్గొన్నారు.

నేటి నుంచి గిరి విజ్ఞాన సంబరాలు

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన విద్యాలయాలకు సంబంధించి బుధవారం నుంచి పాడేరులోని తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో గిరి విజ్ఞాన సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 28 నుంచి 30వతేదీ వరకు జరిగే గిరి విజ్ఞాన సంబరాలను విజయవంతం చేయాలని ఐటీడీఏ పీవో గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఉపాధ్యాయులను ఆదేశించారు.ఈ మేరకు మంగళవారం తలారిసింగి పాఠశాలను సందర్శించి గిరి విజ్ఞాన సంబరాల ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు122 గిరిజన విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ సంబరాల్లో పాల్గొంటారన్నారు. ప్రతి రోజు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజనీ,హెచ్ఎం రీమలి జాన్,ఇ తర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరభద్రరాజు సేవలు మరువలేనివి

అనంతగిరి: మండలంలోని గుమ్మకోట పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన, సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ, శోభ వీరభద్రరాజు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, భీమవరం గ్రామానికి వెళ్లి, శోభ వీరభద్రరాజు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో ఎస్టీ కమిషన్ సభ్యులు జంపరంగి లిల్లీ, కొర్రా రామలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరీ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, సోషల్‌మీడియా జిల్లా అధ్యక్షుడు తెడబారికి సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీటీసీలు మితుల, తౌటినాయుడు, సర్పంచ్‌లు అప్పారావు, సీతయ్య, కో-ఆప్షన్ సభ్యుడు మదీనా, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యానారాయణ తదితరులున్నారు.



వీరభద్రరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు తదితరులు

సీఎం పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

నర్సీపట్నం: అభివృద్ధి పనుల శంకుస్థాపనకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం విచ్చేస్తున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. జోగునాథునిపాలెం వద్ద ఏర్పాటు చేసిన సీఎం సభా స్థలి, బలిఘట్టం వద్ద ఏర్పాటు చేసిన సీఎం హెలిప్యాడ్ పనులు చివరి దశకు చేరాయి. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ గౌతమి సాలి స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు తగిన సూచనలు చేశారు. సీఎం బందోబస్తుకు 1,250 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీలు -7, ఏఎస్పీలు -12, సీఐలు - 35, ఎస్ఐలు - 92, ఏఎస్సైలు - 221, కానిస్టేబుళ్లు - 496, మహిళా కానిస్టేబుళ్లు - 116, హోంగార్డులు - 262, ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసులు 600 మందిని సీఎం బందోబస్తుకు నియమించారు.



సీఎం హెలిప్యాడ్ వద్ద రక్షణ చర్యలను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమిసాలి

రంగురాళ్లు తవ్వుతున్న ముగ్గురి అరెస్ట్

11 మందిపై బైండోవర్ కేసులు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ బాలరేవులు శివారు కొండపై రంగురాళ్లు తవ్వుతున్న ముగ్గురిని అరెస్టు చేశామని మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. తవ్వకాలు చేస్తున్న వారు పారిపోవడానికి ప్రయత్నించగా వారిని సిబ్బందితో కలిసి పట్టుకున్నామని తెలిపారు. చింతపల్లికి చెందిన నగేష్, వెంకటేశ్వరరావు, బాలరేవులకు చెందిన చిన్నారావును అరెస్టు చేశామన్నారు. రంగురాళ్ల తవ్వకాలకు సహకరించిన బాలరేవులకు చెందిన 11 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. వారిని తహసీల్దారు తిరుమలరావు ఎదుట హాజరు పరిచామన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు రంగురాళ్ల కోసం ఈ ప్రాంతానికి వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పామన్నారు.



బైండోవర్ చేసిన బాలరేవుల గ్రామస్తులు

భూ రీసర్వే వేగవంతం

పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్

అనంతగిరి: గ్రామాల్లో భూ రీసర్వే వేగవంతం చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ సూచించారు. మంగళవారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో ఆయన సర్వే అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.మండలంలోని 60వేల ఎకరాల్లో భూ రీసర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. ఉదయం 8 గంటల నుంచి సర్వే చేపట్టాలని, సర్వే చేపట్టేముందు ఆయా గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించి, సమస్యలు ఉంటే పరిష్కారం చూపాలన్నారు. భూ రీసర్వేతో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆందోళన చెందనవసం లేదని రైతులకు తెలియజేయాలన్నారు. రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రాంబాయి, డీటీ ఎర్రాపాత్రుడు, ఆర్ఐ నల్లన్న, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు పొగరాని పొయ్యిలు పంపిణీ

సాక్షి, పాడేరు: స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో పొగరాని పొయ్యిల ఉచిత పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్టు గ్రాప్ జోన్ ఆగ్రో పారెస్ట్రీ ప్రైవేట్ సంస్థ ప్రతినిధి డి.పి.రమేష్ తెలిపారు. సంస్థ తరఫున గిరిజనులకు ఉచితంగా పొయ్యిలు అందజేస్తున్నామన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ అభిషేక్, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అశ్వవాహన గోవింద

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు,అ భిషేకాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి నిత్యపూజలు నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాలు బాలభోగ నివేదన, రాజభోగనివేదన తీర్థగోష్ఠి,ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు జరిగాయి.అనంతరం ఉభయ దేవేరులతోకూడిన స్వామివారిని అశ్వవాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో వేంచేయింపజేసి తిరువీధి సేవలు నిర్వహించారు. భక్తులు కానుకలు మొక్కుబడులు సమర్పించుకున్నారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 12వ పాశురాన్ని విన్నపం చేశారు.ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు,శ్రీనివాసాచార్యులు, గోపాలాచార్యులు, నరసింహాచార్యులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



అశ్వవాహనంపై స్వామివారిని తిరువీధి సేవలకు తీసుకెళ్తున్న దృశ్యం

డిగ్రీలో ప్రవేశాలకు నేడు స్పాట్ అడ్మిషన్లు

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు ఖాళీ సీట్ల భర్తీకి బుధవారం ఒక్కరోజు స్పాట్ అడ్మిషన్లు జరుపుతున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఈటీలో-10, బికామ్ జనరల్‌లో-10, బికామ్ కంప్యూటర్స్‌లో-18, ఎంసీసీఎస్‌లో-23సీట్లు ఖాళీలు ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు నేరుగా కళాశాలకు బుధవారం సాయంత్రంలోగా చేరుకుని ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు టి.అర్జాపురం విద్యార్థులు

ఆరుగురు విద్యార్థుల ఎంపిక

రావికమతం: వైఎస్సార్ జిల్లా పొద్దుటూరులో ఈ నెల 29, 30, 31 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు టి.అర్జాపురం హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 2, 3 తేదీల్లో స్థానిక స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు రాజాన లక్ష్మణరావు, వంశీకృష్ణ, ఆరి వెంకటేష్, పిల్లి ఏంజెల్, మలిచెట్ల భీష్మనందిని, మత్స భాగ్యశ్రీ ప్రతిభ చాటి ఎంపికయ్యారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆదేశాల మేరకు వీరితోపాటు పీడీ రమేష్‌నాయుడు మంగళవారం బయలుదేరి వెళ్లినట్టు హెచ్ఎం కె.ఆర్.ఎస్ నాయుడు, స్కూల్ చైర్మన్ ఎం.శివయ్యనాయుడు తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఒమ్మలి విద్యార్థిని ప్రతిభ

మాడుగుల: ఖోఖో పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా తరఫున పాల్గొన్న మాడుగుల మండలం ఒమ్మలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఉగ్గిన గాయత్రి ద్వితీయ స్థానం సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఈ నెల 17న తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరులో అండర్ - 17 విభాగంలో ఈ పోటీలు నిర్వహించారు. హైస్కూల్‌కు మంచి పేరు తీసుకొచ్చిన గాయత్రిని హెచ్ఎం శోభారాణి, పీడీ సత్యం, చైర్మన్ ఉగ్గిన అప్పలనాయుడు, సర్పంచ్ సింహాచలంనాయుడు మంగళవారం అభినందించారు.



విద్యార్థిని గాయత్రిని అభినందిస్తున్న హెచ్ఎం శోభారాణి, తదితరులు

సాంకేతిక విద్యతో విద్యార్థులకు ఎంతో మేలు

- సాంకేతిక విద్య కోసం రూ.588 కోట్లు కేటాయింపు
- 4.50 లక్షల మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలన్నదే సీఎం జగన్ ఆశయం
- ట్యాబ్‌ల పంపిణీలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: టెక్నాలజీ పరంగా అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి సాంకేతికను అందిపుచ్చుకోవాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, దానికోసం ఎంత మొత్తాన్నైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ఎంఈవో సాయిశైలజ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పోతల లక్ష్మీశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైజూస్ ఆధారిత ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం సర్కారీ స్కూల్ విద్యార్థులకు సాంకేతిక విద్య కోసం 4.50 లక్షల ట్యాబ్‌ల పంపిణీకి రూ.588 కోట్లు కేటాయించిందన్నారు. ట్యాబ్‌ల పంపిణీ పేరిట అమ్మ ఒడి పథకాన్ని నిలిపేస్తారని ఎల్లో మీడియాలో వస్తున్న అసత్య కథనాలను ఖండించారు. కార్పొరేట్ స్థాయిని మించిన విద్యను ప్రభుత్వ స్కూళ్లలో అందిస్తూ.. దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న జగన్ పాలన చూసి ఓర్వలేకే పచ్చ బ్యాచ్ ఈ కుయుక్తులు పన్నుతోందని ఎద్దేవా చేశారు. ఎంపీపీ శ్రీనివాసరావు, స్థానిక మాజీ సర్పంచ్ పోతల లక్ష్మీ శ్రీనివాస్, కొప్పుల వెలమ బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ మాట్లాడుతూ అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, నాడు-నేడుతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యాధునిక భవనాలు నిర్మించి, విద్యార్థులకు పైసా ఖర్చులేకుండా ప్రభుత్వమే ఈ వ్యయాన్ని భరించడం గొప్ప విషయమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఈవో సాయి శైలజ, హెచ్ఎం అప్పారావు మాట్లాడుతూ జగనన్న సాంకేతిక చేయూత ద్వారా విద్యార్థులకు ట్యాబ్‌లను ప్రభుత్వమే ఉచితంగా అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ట్యాబ్, బైజూస్ యాప్ ద్వారా నేర్చుకునే పాఠ్యాంశాల విలువను వెలకట్టలేమన్నారు. కుసుర్లపూడి హెచ్ఎం పి.అచ్యుతం మాట్లాడుతూ తన 30 ఏళ్ల ఉపాధ్యాయ జీవితంలో ఈ ట్యాబ్‌ల పంపిణీ మరువలేని అనుభూతిగా మిగిలిపోతుందన్నారు. తన విద్యాభ్యాస సమయంలో సరైన తరగతి గదుల్లేక, రామాలయం, చెట్ల కింద తరగతులు నిర్వహించే పరిస్థితి ఉండేదన్నారు. ఈ ప్రభుత్వంలో పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులొచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఈ సభలో విద్యార్థులు జగన్ మావయ్య కావాలి, జగన్ మావయ్య జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. సమావేశంలో స్థానిక వైస్ ఎంపీపీలు కొల్లు సన్యాసినాయుడు, దోసపల్లి రాజు, ఎంపీటీసీ గొర్లె రామన్, పలు గ్రామాల సర్పంచ్‌లు యర్రంశెట్టి కాంతమ్మ, కర్రి రాము, గుములూరి బాబులు, మాజీ సర్పంచ్‌లు కుంచంగి హరిబాబు, బంటు సూర్యసన్యాసి, మండల పార్టీ అధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు, మండలంలోని అన్ని జెడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రోలుగుంటలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.